క్లుప్తంగా

నియామకం



నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా కటారి ఉత్తమ్ కుమార్‌ను నియమిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జయ్యారపు అఖిల్ తెలిపారు. శనివారం మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఉత్తమ్‌కుమార్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన దొంతి మాధవరెడ్డికి, కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాలాయి శ్రీనివాస్, వేముల సాంబయ్య, కత్తి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన బక్కి వీరలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.18వేల చెక్కును శనివారం సర్పంచ్ చింతపట్ల మాలతిసోమేశ్వర్‌రావు అందజేశారు. ఎంపీటీసీ మాడుగుల రాజు, ఉపసర్పంచ్ జనార్దన్, రంగు కుమార్, మెరుగు వెంకన్న, శ్రీకాంత్ ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు



సంగెం : మండలంలోని మొండ్రాయిలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లికి ఘనంగా బోనాలు శుక్రవారం రాత్రి సమర్పించారు. వానలు బాగా కురిసి పాడి పంటలు సమృద్ధిగా, పిల్లా పాపలు చల్లంగా ఉండేలా దీవించు తల్లి అని ప్రార్థించారు.

స్థల పరిశీలన



నల్లబెల్లి : స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ పథకంలో భాగంగా మండలంలోని రుద్రగూడెంలో సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణానికి మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాశ్ శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం తప్పకుండా ఇంకుడు గుంతను వినియోగిస్తూ భూగర్భ జలాల పెంచేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండె శ్రీనివాస్ గుప్త, మల్లాడి సాంబరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పద్మనాభ స్వామి, టీఏ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని స్కూళ్లపై చర్య తీసుకోవాలి



నర్సంపేట రూరల్ : నర్సంపేట ప్రాంతంలో అనుమతి లేకుండా స్కూళ్ల పేర్ల ముందు టెక్నో, ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ పేర్లతో పాఠశాలలను నడిపిస్తున్న యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ వాసంతికి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు.

సన్మానం

రాయపర్తి : ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు అందుకున్న సందర్భంగా రాయపర్తి సర్పంచ్ నర్సయ్యతో పాటు, పంచాయతీ కార్యదర్శి అశోక్‌ను శనివారం ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఉత్తమపంచాయతీ కార్యదర్శిగా ఎంపికైన వెంకటేశ్వరపల్లి కార్యదర్శి నర్సయ్య, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ కిషన్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ కిషన్, ఎంపీఓ రామ్మోహన్, ఏపీఓ కుమార్‌గౌడ్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



ఖానాపురం : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సంపత్‌రావు అనే రైతుకు చెందిన పాడిగేదె గ్రామశివారులో మేత మేస్తుండగా విద్యుత్ తీగలు తెగిపడిపోయాయి. దీంతో పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.70వేల విలువ చేసే గేదె మృతి చెందడంతో విద్యుత్ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని రైతు కోరారు.

చెరువు కాదు.. రోడ్డే



జలమయమైన మాధన్నపేట రోడ్డు

వానాకాలం రాక ముందే రోడ్లు జలకళను తలపిస్తున్నాయి.. నర్సంపేటలోని మార్కెట్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు.. శనివారం కురిసిన చిన్నపాటి వర్షానికే చెరువుగా మారుతున్నాయి. నర్సంపేట మున్సిపాలిటీలో ప్రధాన రహదారిగా చెప్పుకుంటున్న ఈ రోడ్డుపై మూడేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.



చెరువును తలపిస్తున్న మార్కెట్ రోడ్డు

చినుకుకే.. చెరువైంది.

నర్సంపేట పట్టణంలోని మాధన్నపేట రోడ్డు చిరుజల్లుకే మొత్తం జలమయమై చిన్నపాటి చెరువులను తలపిస్తోంది. దీంతో నర్సంపేట నుంచి నాగుర్లపల్లి, మాధన్నపేట, భాంజీపేట, కమ్మపల్లి, దాసరిపల్లి, చంద్రయ్యపల్లి, నల్లబెల్లికి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఖాళీ నడక వెళ్లే వారు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి ప్రధాన రహదారిపై నీరు నిల్వ లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

నర్సంపేట/నర్సంపేట రూరల్

నాడు నాటారు.. నేడు నరికారు



కాపులకనిపర్తిలో నరికివేసిన పచ్చని చెట్లు

సంగెం : హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా మారుతుంటే గ్రామాల్లో ఆహ్లాదాన్ని పంచుతున్నాయన్న ప్రజల ఆనందం ఎంతో కాలం నిలవడం లేదు. మండలంలోని కాపులకనిపర్తిలో వరంగల్-మహబుబాబాద్ ప్రధాన రహదారి వెంట గతంలో నాటిన వృక్షాలు నేలకొరిగాయి. నాడు హరితహారంలో మొక్కలు నాటి ఫొటోలు దిగిన ప్రజాప్రతినిధులు, అధికారులు నేడు వృక్షాలను నేల కూల్చుతుంటే పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నాటేటపుడు విద్యుత్ తీగల కింద అనాలోచితంగా నాటారు. నేడు తీగలకు తగులుతున్నాయని మొదలంటూ నేలకూల్చారు. కనీసం కొమ్మలు నరికి వేస్తే కొంతమేర పచ్చదనం ఉండేదని పూర్తిగా ఎందుకు నరికివేశారో అర్థం కావడం లేదని వాపోతున్నారు. అలా నాటడం, పెరిగిన తర్వాత నరకడం గ్రామాల్లో రివాజుగా మారిందని విమర్శలున్నాయి. దీంతో వేలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోందని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగల కింద నాటేటపుడు ఎత్తుగా పెరిగే మొక్కలు కాకుండా తక్కువ ఎత్తులో నీడను, పూలను ఇచ్చే మొక్కలు నాటితే ప్రజాధనం వృథా కాకుండా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

యథేచ్ఛగా మొరం తరలింపు



రాయపర్తి : మండలంలోని గుబ్బడిబోడుకిందితండా వద్ద గల ఎస్సారెస్పీ కాల్వ మొరాన్ని అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. భవిష్యత్‌లో ఎస్సారెస్పీ కాల్వకు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా నిల్వ చేసిన మొరంను శనివారం అక్రమార్కులు ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తున్నారు.పట్టించుకోవల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కట్టలను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

వృద్ధ దంపతుల ఆస్తిపై కన్ను

- తలకొరివి పెట్టినందుకు భూములు ఇవ్వాలని వారి కుమార్తెకు సమీప బంధువు వేధింపులు
- 9 గుంటల స్థలం ఇచ్చినా ససేమిరా..
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు



రోదిస్తున్న బాధితురాలు బంగారి

నల్లబెల్లి : వృద్ధ దంపతులకు తలకొరివి పెట్టిన ఓ వ్యక్తి ఆస్తి కాజేసేందుకు యత్నిస్తున్న ఘటన మూడుచెక్కలపల్లిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ధరావత్ మంగాలి-భాను దంపతులకు కుమార్తె బంగారి ఉంది. ఆమెకు తల్లిదండ్రులు పెళ్లి చేశారు. ఇటీవల ఆ దంపతులు అనారోగ్యంతో మృతి చెందారు. ఆ సమయంలో తల్లిదండ్రులకు తలకొరివి పెట్టేందుకు కుమార్తె బంగారి ముందుకొచ్చింది. కానీ, కుల సంప్రదాయాలు అడ్డురావడంతో భాను తమ్ముడి కుమారుడు భోజ్యాతో ఆ దంపతులకు తలకొరివి పెట్టించారు. ఇదే అదనుగా భావించిన భోజ్యా ఆ కుటుంబం ఆస్తులపై కన్నేశాడు. తనకు బంగారితో సమానంగా వాటా రావాలని పలుమార్లు గొడవపడ్డాడు. గత ఏప్రిల్ 24న గ్రామంలో కులపెద్దలు పంచాయితీ చేసి భోజ్యాకు 8 గుంటల వ్యవసాయ భూమితోపాటు ఒక గుంట ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయించారు. వారి తీర్పు మేరకు భోజ్యాకు భూములను అప్పగించింది. మిగిలిన ఆస్తిపాస్తులు సైతం తనకే అప్పగించాలని తరుచుగా వేధిస్తున్నాడు. బంగారి తనకున్న 30 గుంటల భూమిలో పత్తి విత్తనాలు పెట్టేందుకు రెండు రోజుల క్రితం చదును చేయించింది. భోజ్యా అదే భూమిలో శనివారం విత్తనాలు విత్తాడు. విషయం తెలుసుకున్న ఆమె భూమి వద్దకు వెళ్లగా భోజ్యా దూషించాడు. కర్ర, గొడ్డలి పట్టుకుని భూమి వద్దకు వస్తే చంపుతానని బెదిరించాడు. కాగా, బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్

ఐనవోలు: రాష్ట్రంలోని నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మండలంలోని పంథిని గ్రామానికి చెందిన దాట్ల నైనిక ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందింది. నిరుపేద కుటుంబానికి ఆమె ఆర్థికంగా ఆదుకోవాలని స్థానిక నాయకులను కోరారు. స్పందించిన నాయకులు ఎమ్మెల్యే రమేష్ దృష్టికి తీసుకెళ్లగా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ. లక్ష ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. కాగా శనివారం ఎమ్మెల్యే నివాసంలో లబ్ధిదారుకు ఎల్‌ఓసీని అందించారు.

బాధిత కుటుంబాన్ని ఓదార్చిన ఎమ్మెల్యే

ఐనవోలు మండల కేంద్రానికి చెందిన ఊకంటి శ్రీరంగరావు మృతిచెందగా ఎమ్మెల్యే ఆరూరి రమేష్ బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. శ్రీరంగరావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గ్రామానికి చెందిన పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ కట్కూరి రాజమణి, మండల పార్టీ అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, మిద్దెపాక రవీందర్, సింగారపు రాజు, పల్లకొండ సురేష్, బెన్‌సన్ ఉన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

ఆత్మకూరు: ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రసాద్ కోరారు. మండలంలోని హౌజుబుజుర్గులో శనివారం ప్రజలకు ఆన్‌లైన్ మోసాలను అరిట్టేందుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ షాపింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. అలాగే అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఏటీఎం నంబర్, బ్యాంక్ ఖాతా వివరాలు అడిగితే చెప్పొద్దని అన్నారు. ఓటీపీ నంబర్లు షేర్ చేయవద్దని, అలాంటి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని కోరారు. యువకులు, విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు.

పరామర్శ

సంగెం : మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలకు రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావు శనివారం పరామర్శించారు. మండలంలోని రామచంద్రాపురానికి చెందిన ఈక ఆగయ్య, ఆశాలపల్లికి చెందిన దోబిల బాబురావు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు.

స్నేహితుడి కుటుంబానికి..



ఖానాపురం: పరామర్శిస్తున్న స్నేహితులు

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన కైలాసం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాన్ని 1992వ సంవత్సరంలో కలిసి చదువుకున్న స్నేహితులు శనివారం పరామర్శించి, ఆర్థికసాయం చేశారు. నద్దునూరి కోటి, కోరె సుధాకర్, చంద్రమౌళి, రమేష్, వెంకటనారాయణ, భిక్షపతి, వేణు, చారి, రవీందర్‌రావు తదితరులు ఉన్నారు.

పర్వతగిరి : మండలంలోని బూర్గుమల్ల గ్రామానికి చెందిన గోపా మండల ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్నాడు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా గోపా ఆధ్వర్యంలో శనివారం శ్రీనివాస్‌గౌడ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు.

యువకుడి అదృశ్యం



తొగరు సునీల్

దుగ్గొండి : మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన తొగరు సునీల్ ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం తండ్రి సాంబయ్యతో గొడవ పడి ఇంటి నుంచి బయటి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో సాంబయ్య శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 87126 85232 నంబర్‌లో సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

తొగర్రాయిలో వృద్ధుడు..



కంతిరి ఐలయ్య

దుగ్గొండి మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన వృద్ధుడు కంతిరి ఐలయ్య ఈ నెల 21న రాత్రి ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. బంధువుల ఇళ్లు, పంట పొలాల వద్ద కుటుంబ సభ్యులు వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. ఐలయ్య మనుమడు నితిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

మగ్దుంపురం గ్రామంలో..



పుట్ట భిక్షపతి

చెన్నారావుపేట : మండలంలోని మగ్దుంపురం గ్రామానికి చెందిన పుట్ట భిక్షపతి శుక్రవారం తన భార్య కృష్ణవేణితో గొడవపడ్డాడు. అనంతరం ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. రాత్రి వరకు ఇంటికి రాక పోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికారు. అయినా ఆచూకీ లేదు. దీంతో భిక్షపతి కుమారుడు రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు.

సాంబయ్య మృతి పార్టీకి తీరనిలోటు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

చెన్నారావుపేట : సీపీఐ మండల కార్యదర్శి అమరజీవి మర్రి సాంబయ్య మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ అన్నారు. ఈ మేరకు శనివారం సాంబయ్య దశదిన సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి సంతాప సభ నిర్వహించారు. అనంతరం మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు సిద్ధాంతాలను నమ్మి తాను ఆచరిస్తూ పేద ప్రజల సమస్యలకోసం పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. మండల కార్యదర్శి గడ్డ యాకయ్య, ఖానాపురం మండల కార్యదర్శి బానోత్ వీరనాయక్, గోవర్ధన్ యాకయ్య, దేవపాల, నాగరాజు, సోములు, యాదగిరి, యశోద, సరిత, అరుణ, శైలజ పలువురు ఉన్నారు.

నేడు మంత్రి సత్యవతిరాథోడ్ రాక

సంగెం : మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవానికి గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నేడు(ఆదివారం) రానున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి శనివారం ప్రకటనలో తెలిపారు. కావున ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆదివారం ఉదయం చింతలపల్లి నుంచి వీఆర్ఎన్ తండా వరకు బీటీ రోడ్ పనులకు శంకుస్థాపన, పల్లారుగూడ, మొండ్రాయిలో అంతర్గత సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తారన్నారు.

ఆధార్ సేవలు పునరుద్ధరణ

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలోని సబ్ పోస్టాఫీస్‌లో ఆధార్ అనుసంధాన సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో ఈ సేవలను అందించినప్పటికీ కొంత కాలం నిలిపివేశారు. అయితే నాలుగు రోజుల క్రితం నుంచి ఈ సేవలను మళ్లీ ప్రారంభించినట్లు బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ శ్రీహర్ష తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు చేయడానికి, చిరునామా మార్చడానికి, పేరులోని తప్పులను సవరించడానికి, పుట్టిన తేదీ తప్పుగా నమోదైన వారు సరైన జనన ధ్రువపత్రాలను జతచేసి మార్చుకోవడానికి, పోస్టాఫీస్‌లోని ఆధార్ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఆధార్ అప్‌డేట్, మొబైల్ లింకు, నగదు డిపాజిట్, బదిలీ, తపాలా జీవిత బీమా ప్రీమియం చెల్లింపులు చేసుకోవచ్చన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆధార్ సేవలను పొందవచ్చన్నారు. గీసుకొండ మండలంలోని గ్రామాలతో పాటు, 15,16,17 డివిజన్ల ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



ఖానాపురం: భోజనాన్ని తనిఖీ చేస్తున్న రత్నమాల



పర్వతగిరి: మాట్లాడుతున్న సత్యనారాయణ

ఖానాపురం : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ రత్నమాల సూచించారు. ఈ మేరకు మండలంలోని నాజీతండా, రంగాపురం, అశోక్‌నగర్‌లోని ప్రాథమిక, హైస్కూళ్లను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సామర్థ్యాలు, సంఖ్యలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకు చర్యలు తీసుకోవాలి

పర్వతగిరి : ఉపాధ్యాయులు నమోదు, హాజరు శాతం పెంచుకొని ఈ అకాడమిక్ సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలని ఎంఈఓ చదువుల సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నమోదు తక్కువ ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులు సర్దుబాటు అంశంపై చర్చించి ఉపాధ్యాయులను వివిధ పాఠశాలలకు సర్దుబాటు చేశారు. మండల నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి, పర్వతగిరి, కొంకపాక, ఏనుగల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జలీల్, ప్రేమ్‌సాగర్, హైమావతి పాల్గొన్నారు. అనంతరం పర్వతగిరి ఉన్నత పాఠశాలలో రాగిజావాను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సిబ్బందికి తగు సలహాలు సూచనలు చేశారు. అలాగే కేజీబీవీని సందర్శించి విద్యార్థుల హాజరును పరిశీలించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖానాపురం : మహిళా సంఘాల్లోని ప్రతీ సభ్యురాలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని అడిషనల్ డీఆర్డీఓ గొట్టె శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వీఓఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల పనితీరు, రుణాల వివరాలు, బ్యాంక్ లింకేజీలపై సంఘాల సభ్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నెలవారి సమావేశాలు, లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలన్నారు. సంఘాల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోకుంటే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ సమావేశంలో డీపీఎం దయాకర్, అనిత, భవాని, ప్రేమ్‌కుమార్, కందిక సుధాకర్, కవిత, జ్యోతి, సీసీ, వీఓఏలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశ ప్రగతి



మాధవరెడ్డికి తిలకం దిద్ది మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

దుగ్గొండి : దేశం ప్రగతి బాటపట్టాలన్నా, రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఏఐసీసీ సభ్యుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని గుడ్డెలుగులపల్లి, ముద్దునూరు గ్రామాల్లో హాథ్‌సే హాథ్ జోడోయాత్ర శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డికి మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులతో స్వాగతం పలుకుతూ తిలకం దిద్దారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నేడు కొలువులు కరువయ్యాయన్నారు. దళితులకు 3 ఎకరాల భూమి, రైలుపెట్టె లాంటి డబుల్ బెడ్రూం ఇళ్లు, రుణమాఫీ జాడేలేదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, ఎర్రల్ల బాబు, చెన్నూరి కిరణ్ రెడ్డి, ఒలిగె నర్సింగరావు, పెండ్యాల రాజు, నరిగె ప్రవీణ్‌కుమార్, రామారావు, సాంబయ్య, దంజ్యా నాయక్, జంగిలి రవి, నగేష్, రమేష్, కుమారస్వామితోపాటు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి



సంగెం: నార్లవాయిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ తదితరులు

సంగెం : కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్ అన్నారు. మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా శనివారం మండలంలోని నార్లవాయిలో ఇంటింటికి తిరుగుతూ కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్నఅభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి వివరించారు. మోదీ చేసిన సేవలను వివరించి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాళ్లపెల్లి రాజమౌళి, చిలపాక రాజు, చిర్ర పరమేశ్వర్, బర్ల రాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామంలో 209వ పోలింగ్ బూత్‌లో నిర్వహించిన మహాసంపర్క్ అభియాన్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి శనివారం పాల్గొన్నారు. అనంతరం ప్రచార కరపత్రాలను పంపిణీ చేశామన్నారు. మల్లెపాక దూడయ్య, నాంపల్లి యాకయ్య, తాళ్లపెల్లి కృష్ణమూర్తి, ఎల్లయ్య, పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి



చెన్నారావుపేట: కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ముదిరాజ్‌లు



నల్లబెల్లి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్ననాయకులు

చెన్నారావుపేట : ముదిరాజ్‌లను అవమానించే విధంగా మాట్లాడిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌లకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మెపా జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి సాంబరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కోనాపురం గ్రామంలో ముదిరాజ్‌లు శనివారం కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతికే సేవ చేసే జర్నలిజంలో పనిచేస్తున్న అజయ్ ముదిరాజ్‌ను అక్రమంగా బంధించి, పరుష పదజాలంతో తిట్టడం ముదిరాజ్‌లను అవమాన పరచడమేనని అన్నారు. కార్యక్రమంలో అన్నెబోయిన సారంగం, కీసరి రమేష్, సాంబశివుడు, బోనాల రాకేష్, నాగరాజు, రమేష్, సూరయ్య, మల్లయ్య, ముత్యాలు ఉన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నల్లబెల్లి : ముదిరాజ్‌లను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు పాండవుల రాంబాబు మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులను కించపరిచేలా కౌశిక్ రెడ్డి మాట్లాడడం సరైంది కాదన్నారు. నాయకులు గొనేల నరహరి, గుండాల కుమారస్వామి, గుండాల శ్రీశైలం, పెండ్యాల మహేందర్, పిట్టల ప్రవీణ్, తాటికొండ సుదర్శన్, జక్కుల కుమార్, సూరయ్య, శ్రీను, నరేష్, మోహన్ పాల్గొన్నారు.